www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 31 ఆగస్టు 2025
5
వైఎస్ఆర్

బార్ కౌన్సిల్ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప : రాష్ట్రవ్యాప్తంగా భారత న్యాయవాదుల సంఘం నిర్వహించిన ఆల్ ఇండియ బార్ కౌన్సిల్ ఎగ్జామినేషన్ మోడల్ టెస్ట్‌కు కడపలో యువ న్యాయవాదుల నుంచి విశేష స్పందన లభించినట్లు భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ పేర్కొన్నారు. కడప బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటల నుండి ఎఐబిఇ పరీక్ష నిర్వహించనున్నట్లు ఇందులో 25 మంది యువ న్యాయ వాదులు రాశారని తెలిపారు. ప్రతి సందర్భంలోనూ జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్టును 1983 నుండి కూడా నిర్వహిస్తూ న్యాయవాదులకు ఉపయోగపడే పనులు ఎన్నో ఐఎఎల్ చేసిందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత న్యాయవాదుల సంఘం ఏర్పడినప్పటి నుండి న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం పని చేయడమే కాక రాజ్యాంగ పరిరక్షణ కోసం నిత్యం కృషి చేస్తూ న్యాయవ్యవస్థ పాత్రను, ప్రాముఖ్యతను గురించి న్యాయవాదుల్లో చైతన్యం కలుగు చేస్తోందని వారు అన్నారు.

యూరియా చిటపటలు!

మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ రామగోవిందరెడ్డి

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

హాజరైన జడ్‌పిటిసిలు, ప్రజాప్రతినిధులు

ఉల్లిధరలపై ప్రశ్నిస్తున్న కమలాపురం జడ్‌పిటిసి సుమిత్రమ్మ

- ఉల్లి, చీనీ రైతులను ఆదుకోవాలి
- యూరియా కొరతపై ఆందోళన వద్దు : కలెక్టర్
- బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చినవారిపై చర్యలేవీ?: జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో యూరియా కొరతను అధిగమించడానికి గట్టిచర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సభ్యులు ముక్తకంఠంతో నినదించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సభాభవనంలో జడ్‌పి చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల ఎన్నికైన పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసిలు మారెడ్డి లత, అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ సమీక్షలో భాగంగా చక్రాయపేట, వేముల, వేంపల్లి, బి.మఠం, కాశినాయన జడ్‌పిటిసిలు యూరియా లభ్యతపై జిల్లా అధికారులు చెప్పే మాటలకు, క్షేత్రస్థాయిలో యూరియా కొరతకు పొంతన లేకుండా పోయిందని వాపోయారు. కమలాపురం జడ్‌పిటిసి లింగాల సుమిత్రమ్మ మాట్లాడుతూ జిల్లాలో ఉల్లిధరలు అధఃపాతాళానికి పడిపోయాయని, ప్రస్తుతం క్వింటాల్ ఐదు వందలు పలుకుతున్నాయని, ప్రభుత్వం క్వింటాల్ రూ.2 వేలు మద్దతు ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీరపునాయునిపల్లి జడ్‌పిటిసి రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉల్లి ధరల తరహాలో చీనీధరలు పడిపోయాయని, రూ.కిలో ఎనిమిది అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. టన్నుకు రెండున్నర టన్నులు సూట్ ఇవ్వాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పందించి పులివెందుల అరటి మార్కెట్‌లో అటువంటి దుస్థితి లేదని, చిన్నచిన్న లోపాలుంటే సరిదిద్దుతామని చెప్పారు. రైల్వేకోడూరు జడ్‌పిటిసి స్పందించి అరటి రైతుకు ఇవ్వాల్సిన ప్రోత్సాహం ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. అన్నమయ్య జిల్లా హార్టీకల్చర్ అధికారి స్పందించి అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన మామిడి రైతులకు పరిహారం జాబితా రూపకల్పన దశలో ఉందని వివరించారు. పింఛన్ల తొలగింపు అంశంపై ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి నిలదీశారు. కలెక్టర్ స్పందించి జిల్లాలో 2,223 మంది అనర్హులుగా తేలగా, వేరే కేటగిరీలోకి కొందరి అర్హులుగా ఉన్నారని వివరించారు. నోటీసులు అందుకున్న వారిలో 1189 మంది దరఖాస్తు చేసుకోలేదని, వీరిలో కొందరికి తెలిసో, తెలియకో ఉన్నట్లు ఉందని వివరించారు. అనంతరం వేంపల్లి ఎంపిపి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూ.30 వేలు తీసుకుని వికలాంగ సర్టిఫికెట్లు ఇస్తుండడం ఓపెన్ సీక్రెట్ అని తెలిపారు. కలెక్టర్ స్పందించి దొంగ సర్టిఫికెట్లు ఇచ్చిన, పెట్టిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై చర్యలేవని జడ్‌పి చైర్మన్ రామగోవింద్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లాలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తల్లికివందనం, అన్నదాత సుఖీభవ అందని పరిస్థితి ఏర్పడిందని పోరుమామిళ్ల జడ్‌పిటిసి ముత్యాల చెన్నయ్య సోదాహరణంగా వివరించారు. కలెక్టర్ స్పందించి రీసర్వే సమయంలో ఎల్‌పిఎం సమస్య కారణంగా ఇటువంటి పరిస్థితి నెలకొందని, త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు. బ్రహ్మంగారిమఠం ఎంపిపి వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ బి.మఠంలో 14 సచివాలయ భవనాలను ప్రారంభించినప్పటికీ కరెంటు సమస్య తీరడం లేదని వాపోయారు. ట్రాన్స్‌కో ఎస్‌ఇ స్పందించి తొమ్మిది సచివాలయాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చామని, మిగిలిన వాటికీ విద్యుత్ సదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. బి.మఠంలో బస్‌షెల్టర్ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కమలాపురం నియోజకవర్గ పరిధిలోని చిన్నచెప్పలి, కీర్తిపల్లి, సంగమేశ్వరాలయ రోడ్డు, కొమ్మద్ది రహదారి గుంతలమయంగా మారిందని, తరుచుగా వాహన ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయని కమలాపురం జడ్‌పిటిసి ఎల్.సుమిత్రమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి స్పందించి ఇరిగేషన్, ఆర్ అండ్‌బి అధికారులను ఎప్పటిలోపు పూర్తి చేస్తారో చెప్పాలని నిలదీశారు. చెన్నూరు ఎంపిపి సురేష్ మాట్లాడుతూ సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని, తద్వారా బస్‌స్టేషన్ సదుపాయానికి అవకాశం ఉంటుందని వాపోయారు. అనంతరం వేంపల్లి ఎంపిపి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్లు గుంతలమయంగా మారాయని, ఆక్రమణలపై ఆర్‌అండ్‌బి చోద్యం చూస్తోందన్నారు. ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం పెద్ద ముడియం మండలం గుండ్లకుంటలోని జాతీయ రహదారిలోకి వరదనీరు ప్రవహిస్తోందని, కడప నగరరంలోని ఇక్బాల్ రైస్‌మిల్ దగ్గర నుంచి కిలోమీటరు మేరకు వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, సందులు, స్కూల్‌జోన్ సమీపంలో మార్కింగ్ సైతం చేయలేదని, ఫలితంగా ప్రమాదాల తీవ్రత పెరుగు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లాడుతూ పాపాఘ్నిబ్రిడ్జి, అద్దాలమర్రి బ్రిడ్జి, కాలేటివాగు, గండి ఆంజనేయస్వామి ఆలయాల పనులు 80 శాతం మేరకు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 249 ప్యాక్స్ ఉన్నాయని, వీటిలో 24 ప్యాక్స్‌కు సొంతభవనాలు ఉన్నాయని, మిగిలిన వాటికి ఆర్‌ఎస్‌కె భవనాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ స్పందించి జిల్లాలోని డిసిఎంఎస్ కార్యాల యాలకు యూరియా బస్తాలను మంజూరు చేయాలని కోరారు. రూ.కోటితో స్కూల్ భవన సముదాయన్ని నిర్మిస్తే బిల్లులు కావడం లేదని వాపోయారు. జిల్లా నాబార్డు అధికారి గురివిరెడ్డి లంచం ఇవ్వనిదే టోకెన్ కొట్టడం లేదని బి.మఠం ఎంపిపి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు స్పందించి రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ స్పందించి కడప జిల్లాలో 83 టిఎంసిలను నిల్వ చేయడానికి అవకాశం ఉందని, 53 టిఎంసిలను నిల్వ చేశామని, ప్రాజెక్టుల సమీపంలోని చెరువులను వరుస క్రమంలో నింపుతున్నామని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, జడ్పీటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన జడ్‌పిటిసిలు మారెడ్డి లత, ముద్దుకృష్ణారెడ్డి

లక్కీడిప్ తీసి దుకాణాలు కేటాయిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాలు కేటాయింపు

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టరేట్ కార్యాలయంలోని పీజీ ఆర్ఎస్ హాలులో జిల్లాలో ఓపెన్ కేటగిరిలో నోటిఫై చేసిన 27 బార్లలో 12 బార్లు గీత కులాలకు రెండు బార్లు శనివారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సమక్షంలో లక్కీ డ్రా ద్వారా కేటాయించారు. దరఖాస్తు ఫీజు రూపంలో రూ.12 కోట్లు,, ప్రాసెసింగ్ ఫీజు రూపంలో రూ. 6.10 లక్షలు, మొదటి విడత లైసెన్సు ఫీజు రూపంలో రూ. 1.19 కోట్లు ప్రభుత్వ ఖాతాకు జిల్లాలోని బార్ల ద్వారా రెవెన్యూ వచ్చింది. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

తలపడుతున్న కర్నూలు, నెల్లూరు జట్లు

అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

- భారీ స్కోరు దిశగా చిత్తూరు జట్టు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాలలో ఎసిఎ సౌత్ జోన్ అండర్- 23 మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 346 పరుగుల భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. ఆ జట్టులోని జెనిక్ దాస్ బ్యాటింగ్ అద్భుతంగా ప్రదర్శించి 109 పరుగులు (సెంచరీ) చేశాడు. రెడ్డి రుషిల్ 84, తేజా రెడ్డి 60 (నాటౌట్), వెంకటేష్ 54 పరుగులు చేశారు. కడప జట్టులోని ఎస్ఎమ్‌డి అస్లాం రెండు వికెట్లు తీసుకున్నాడు. వైఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నెల్లూరు, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ ప్రారం భమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 82.0 ఓవర్లను 6 వికెట్ల నష్టానికి 374 పరుగుల భారీ స్కూల్ సాధించింది. ఆ జట్టులోని సోహన్ వర్మ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 166 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. పవన్ రిత్విక్ 79, మాధవ్ 43 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అక్షిత్ రెడ్డి 2, సాయి ప్రణవ్ చంద్ర 2 వికెట్లు తీసుకున్నారు.

టెలికాం ఉద్యోగుల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికైన నూతన కార్యవర్గం

కడప టెలికాం ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ రిజిస్టర్ నంబర్ 1415 కడప, జిల్లా ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు సుబ్రహ్మణ్యం, మురళి పేర్కొన్నారు. శనివారం నగరంలోని బిఎస్ఎన్ఎల్ జిఎం కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షులుగా కళ్యా సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఆకుల సుబ్బారావు, కార్యదర్శిగా ఎం.సి.సుబ్బారెడ్డి, సభ్యులుగా ఎ.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, ఎం. రఘురామయ్య, వి.వెంకట రమణయ్య ఎన్నికయ్యారని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగుల ఇంటి స్థలాల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు. సొసైటీ తరపున ఉద్యోగులకు, పెన్షనర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

హాహాకారాలు!

ప్రజాదృష్టి

జిల్లా రైతాంగం హాహాకారాలు చేస్తోంది. యూరియా కొరత, చీనీ, ఉల్లి ధరలు, అరటి, మామిడి పంట నష్టం, బీమా సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం కారణంగా రైతుల ఆక్రంధనలు మిన్నంటుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని సుమారు 2.88 లక్షల మంది రైతులను యూరియా కొరత వెంటాడుతోంది. జిల్లా వ్యవసాయశాఖ యూరియా కొరత లేదని చెబుతున్న మాటలకు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. జిల్లాలోని 432 ఆర్ఎస్‌కెల్లో ఐదు రకాల ఎరువులను అందుబాటులో ఉంచామని చెబుతోంది. ఆయకట్టు ప్రభావిత ప్రాంతాలైన కెసి కెనాల్, తెలుగుగంగ కాల్వల పరిధిలోని ఆర్ఎస్‌కెల్లో స్వల్ప స్థాయిలో చేసిన నిల్వలు నిమిషాల వ్యవధిలో ఖాళీ అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రయివేటు డీలర్లు యూరియా బస్తా రూ.266 విక్రయించాల్సి ఉండగా రూ.350 నుంచిరూ.400 వరకు విక్రయిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం యూరియాను తక్కువ పరిమాణంలో వినియోగించాలని, కేంద్రం నానో యూరియా వినియోగించాలనే ఉద్దేశంతో నిల్వలు అందుబాటులో ఉంచడం లేదనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా, రసాయనిక ఎరువుల వినియోగం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో రైతులకు అవగాహన కల్పించాలి. ఇలా చేయకుండా ఉద్దేశపూర్వకంగా యూరియా తదితర ఎరువులను అందుబాటులో ఉంచకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు పట్టణాల నుంచి నంద్యాల జిల్లా రైతాంగం రూ.800 వెచ్చించి తీసుకెళ్తుతోంది. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ దృష్టి సారించాల్సి ఉంది. ఎంఆర్‌పి రేట్లకే యూరియాను విక్రయించాలనే ఆదేశాల నేపథ్యంలో ఖాజీపేట, మైదుకూరు తదితర ప్రాంతాల్లోని ప్రయివేటు డీలర్లు దుకాణాలను మూసివేస్తున్నారు. అనుచిత ధోరణులను నివారించాలి. లేనిపక్షంలో యూరియా కొరత తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ ఆర్ఎస్‌కెలు, ప్రయివేటు డీలర్లకు యూరియాను పరిమితం చేయకుండా డిసిఎంఎస్ దుకాణాల్లో యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. వీటి ద్వారా మండలాల రైతులకు చాలినంత అందుబాటులో ఉంచాలి. తాజా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ సభ్యులందరూ యూరియా కొరతపై ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఉల్లి, చీనీ ధరలు అధఃపాతాళానికి పడిపోయింది. ప్రభుత్వం తక్షణమే ఉల్లి, చీనీ ధరలను పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఉల్లి క్వింటాల్ రూ.2 వేలు కొనుగోలు చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. ప్రభుత్వం క్వింటాల్ రూ.1,200 కొనుగోలు చేయాలనడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. చీనీ ధరలను పెంచాలి. చిత్తూరు జిల్లాలోని తోతాపురి మామిడికి మద్దతు ధర కల్పించిన తరహాలో చీనీ రైతును ఆదుకోవాలి. పులివెందుల మార్కెట్‌లో వ్యాపారుల దోపిడీని అరికట్టాలి. పది టన్నులకు రెండున్నర టన్నులు సూట్ పేరుతో దోపిడీ చేయడాన్ని నిరోధించాలి. కలెక్టర్ దృష్టి సారించి చీనీ రైతుల కష్టాలను, కడగండ్లను పరిష్కరించాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పుస్తకాలు అందజేస్తున్న ఆముక్తమాల్యద

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రముఖ సాహితీవేత్త, చరిత్రకాలు, భాషా పరిశోధకులు 'కళాసరస్వతి' డాక్టర్ తిరుమల రామచంద్ర కుమార్తె ఆముక్తమాల్యద చెన్నైలో తన నివాసంలోని విలువైన పుస్తకాలను శనివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన విలువైన గ్రంథాల్లో ప్రత్యేకించి తిరుమల రామచంద్ర రచనలు ఉండడం విశేషమన్నారు. వాటిలో బృహదారణ్యకం, మనవి మాటలు, అహంభో అభివాదయే, తిరుమల రామచంద్ర జీవితం-సాహిత్యం, ప్రాకృత వ్మాయంలో రామకథ లాంటి పుస్తకాలు న్నాయన్నారు. వీటితోపాటు స్వయంభూ, మరో 11 కథలు, ఇసుక రేణువులు, ఇదిగో లోకానికి ఇది నా లేఖ, శాసనాలు సామాజిక, సాంస్కృతిక, చరిత్ర, పార్వతీ పరిణయం, శ్రీరమణ పుస్తకాలతోపాటు ఆంగ్ల నవలలు, కథలు కూడా ఉన్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరించిన ఆముక్తమాల్యదను వైవీయూ ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

క్లస్టర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : క్లస్టర్ టీచర్లకు రెగ్యులర్ ప్లేస్‌లను కేటాయించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్‌బాషా, రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు కె. సురేష్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు డిఇఒ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో నంబర్ 22 మేరకు జూన్‌లో ముగిసిన ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా 117 జీవో రద్దు కావడం వల్ల మిగులు ఉపాధ్యాయులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, గణిత, భాష పండిత ఉపాధ్యాయులను క్లస్టర్ టీచర్లుగా నియమించారని తెలిపారు. బదిలీల అనంతరం జూన్, జూలై లో ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చెందారని పేర్కొన్నారు. ఈనెల 31న మరి కొంతమంది విరమణ కానున్నారని చెప్పారు. డిఎస్‌సి- 2025 ద్వారా ఈ సబ్జెక్టులకు సంబంధించి ఖాళీలను గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు హబీబుల్లా, మహబూబ్ బాషా, కడప నగర అధ్యక్షుడు సాదిక్ అలీ పాల్గొన్నారు.

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

సిఐగా బాల మద్దిలేటి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

స్థానిక పోలీస్ స్టేషన్ సిఐగా బి. బాల మద్దిలేటి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న నాగభూషణం ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరికైనా అన్యాయం జరిగితే నిర్భయంగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు .వాస్తవాలు పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సాధిస్తామని అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

సర్దార్ ఖాజా మొయినుద్దిన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ఉర్దూ శాఖ అకాడమిక్ కన్సల్టెంట్ సర్దార్ ఖాజా మొయినుద్దిన్ కు తమిళనాడు రాష్ట్రం వేల్లూరు తిరువల్లువర్ విశ్వవిద్యాలయం ఉర్దూ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. ఈయన డాక్టర్ మహ్మద్ యాసిర్ మార్గదర్శకంలో " తీహకిక్ ఓ తన్కీద్ కా ఇర్తేకా:శోభ - ఇ-ఉర్దూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కా కిర్దార్ " అనే అంశంపై చేసిన పరిశోధన కు డాక్టరేట్ అందజేశారు. సర్దార్ ఖాజా మొయినుద్దిన్ రాసిన 315 పరిశోధన పత్రాలు వివిధ జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఈయనకు వైవీయూ అధ్యాపకులు, ఉర్దూశాఖ విభాగాధిపతి, సహ అధ్యాపకులు అభినందించారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 146వ సదస్సు ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 146వ సదస్సులో 'శుభ్రజ్యోత్స(యెద్దల గంగయ్య) జీవితం-సాహిత్యం' అనే అంశంపై నాగిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లె వెంకటరమణ ప్రసంగిస్తారని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరం సమీపంలోని ఆజాద్ నగర్‌లో ఉన్న బృందా వృద్ధాశ్రమంలో వృద్ధులకు మల్లేశ్వరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త వెంకటేశ్వర్లు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు దైవంతో సమానమని, ఇటువంటి వారికి అన్నదానం చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దాతలు విరివిగా పాల్గొని ఇలాంటి వృద్ధాశ్రమాలకు అండగా నిలవాలన్నారు. వృద్ధులకు సేవలందిస్తున్న బృంద వృద్ధాశ్రమం నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సర్వేయర్ పవన్ కుమార్, జగదీష్ కుమార్, కుటుంబ సభ్యులు, బృందా వృద్ధాశ్రమ నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధారాణి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దాతలు

మాట్లాడుతున్న ఎస్ఐ శాంతమ్మ

మహిళలకు కొండంత అండ 'శక్తి' యాప్

ప్రజాశక్తి - కడప అర్బన్

శక్తి యాప్ మహిళలు, బాలికల ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ పేర్కొన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి శనివారం నగరంలోని సాయిబాబా హైస్కూల్, భాష్యం హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, చిన్నారులపై నిర్వహించే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రి 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించి పోలీసు వారు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు కల్పిస్తున్న మహిళా రక్షణ చట్టాల గురించి వివరించి వారిని చైతన్యవంతులను చేశారు. మహిళలు, బాలికలు సెల్‌ఫోన్‌లో ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోన్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నంబర్ ద్వారా ఫిర్యాదు చేసిన వెంటనే పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకుని మీ సమస్యను, ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకులకు కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-కాశినాయన

గణేష్ పండుగ సందర్భంగా మండల కేంద్రమైన నరసాపురంలో రాములవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గ్రామంలోని యువకులకు కబడ్డీ పోటీలు గ్రామానికి చెందిన కడప విద్యుత్ శాఖ ఏడీ గోంట్ల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా వారికి తగిన బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత గ్రామమైన నరసాపురంలో పండుగల సందర్భంగా ఇలాంటి చిన్న చిన్న కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది అన్నారు. కార్యక్రమంలో ఒక ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస రాయల్, పిచ్చిరెడ్డి మోహన్ రెడ్డి, జయరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకట్రాముడు పాల్గొన్నారు అదేవిధంగా అభయాంజనేయ స్వామి దగ్గర ఉన్న గణేష్‌ని విగ్రహం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కబడ్డీ ఆడుతున్న యువకులు

చెక్కులు పంపిణీ చేస్తున్న భూమిరెడ్డి ఉమాదేవి

పేదల ప్రాణాలు కాపాడేందుకే సిఎంఆర్ఎఫ్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ప్రాణాలు కాపాడడానికి సిఎం సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి తెలిపారు. శనివారం తన నివాసంలో నియోజకవర్గంలో దాదాపు 20 మంది లబ్ధిదారులకు రూ.16,67,281 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థికసాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులరెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల గాడిచర్ల వారి వీధిలో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు. ఓ కార్యక్రమం సందర్భంగా ఎడాల సుబ్రహ్మణ్యం దంపతులు, భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణాన్ని అర్చకులు కృష్ణ రాజేష్‌శర్మ నిర్వహించారు. పులివెందుల మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, అంకాలమ్మ ఆలయ ఛైర్మన్ నాగేంద్రప్రసాద్ హాజరయ్యారు. అనంతరం వినాయకుని మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వరసిద్ధి వినాయక భక్తమండలి, యువజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



నందీశ్వర స్వామి దేవాలయం వద్ద తులసిరెడ్డి, నాయకులు

రూ.3.50 కోట్లతో నందీశ్వర దేవాలయ నిర్మాణం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని నందిపల్లె గ్రామంలో ప్రజలు, ప్రభుత్వ సహకారంతో రూ3.50 కోట్లు అంచనాతో సర్వాంగ సుందరంగా నందీశ్వర స్వామి దేవస్థానాన్ని నిర్మించడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. నందీశ్వర దేవస్థానాన్ని ఆలయ ఛైర్మన్ మారం శ్రీకాంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు శనివారం తులసిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల-వేంపల్లె ప్రధాన రహదారి పక్కన ప్రశాంతమైన వాతావరణంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో నందీశ్వర స్వామి దేవస్థానం నిర్మించడం సంతోషకరమన్నారు. ప్రత్యేకించి గ్రామం పేరు నందిపల్లెకు తగ్గట్టుగా నంది విగ్రహం చూడముచ్చటగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మారం సులోచనదేవి, నందీశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్‌రెడ్డి, కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామగంగిరెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్‌రెడ్డి, ఐచర్ రమణ, చెన్నకేశవ పాల్గొన్నారు.

సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట కొత్త సిఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్.వంశీధర్‌ను మండల టిడిపి నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సత్కరిస్తూ అభినందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి కమలాపురం ఫరూక్ అహ్మద్, రహమత్‌ఖాన్ పల్లె నాయకులు ప్రతాపరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు నంద్యాల సుబ్బయ్య యాదవ్ ఉన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయడంతోపాటు ప్రజలకు సత్వర న్యాయ సేవలు అందేలా చూడాలని వారు సిఐని కోరారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

ప్రజాశక్తి - వేంపల్లె

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వేంపల్లెలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. మండలం వ్యాప్తంగా దాదాపు 145 విగ్రహాలను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అన్ని చోట్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించి, నందిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. ఏలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయా గ్రామోత్సవంలో మహిళలు, యువత, పిల్లలు కేరింతలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చింతలమడుగుపల్లె, గరుగువీధితోపాటు ఆయా ప్రాంతాల్లో వినాయకుడి మండపాల నిర్వాహకులు అన్నదానాలను చేపట్టారు.

అన్నిటికంటే అన్నదానం గొప్పది

పులివెందుల రూరల్ : అన్నిటికంటే అన్నదానం గొప్పదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి తెలిపారు. పట్టణంలోని హైటెక్ కంప్యూటర్ సెంటర్ వినాయక స్వామి విగ్రహాల వద్ద శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హైటెక్ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు

ముద్దనూరు : వినాయక చవితి పర్వదినం సందర్భంగా వాడవాడలా కొలువుదీరిన వినాయక విగ్రహాలను శనివారం మండపాల కమిటీ నిర్వాహకులు ఘనంగా గ్రామోత్సవం చేస్తూ నిమజ్జనానికి తరలించారు. అన్నదానాలు ఏర్పాటు చేశారు.

వేంపల్లెలో నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు

కాసులున్నా కట్టలేరు.. కట్టినోళ్లు ఉండలేరు

మధ్యలోనే ఆగిపోయిన జగనన్న కాలనీలు - పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో వైసిపి పాలనలో పేదలకు జగనన్న కాలనీల పేరుతో ఇంటి స్థలం, పట్టాలు పంపిణీ చేశారు. అక్కడ పూర్తిస్థాయిలో కనీస వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆ స్థలాలను ఖాళీగా వదిలేశారు. కొందరు పునాది వరకు వేసి వదిలేశారు. గత పాలనలో అధికారుల ఒత్తిడితో ఇల్లు నిర్మించుకున్న వారు వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అవి వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే లేదు. గతంలో కొన్నిచోట్ల కొండ ప్రాంతంలో జగనన్న కాలనీలు ఇచ్చారు. అక్కడ సరైన దారులు, నీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం లేదు. వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్లు చదును లేకపోవడంతో లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 853 మందికి జగనన్న కాలనీలో ఇంటి పట్టాలిచ్చారు. పంచాయతీల వారీగా నేలటూరు 17, దిశవంచ 38, మల్లెపల్లె 85, ముడమాల 65, పలుగురాళ్లపల్లె 55, రేకులకుంట 40, రేకులకుంట-2కు 30, సోమిరెడ్డిపల్లె-1కు 259, సోమిరెడ్డి పల్లె -2కు 83, సోమిరెడ్డి పల్లె-3కు 67, చౌదరివారిపల్లె 26, తోట్లపల్లె 59, నాగిశెట్టిపల్లె 29 ఇలా పంచాయతీ వారీగా గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరున పట్టాలిచ్చారు. పునాది స్థాయిలో 51, బేస్ లెవెల్‌లో 153, లింటల్ లెవెల్‌లో 13, గోడ లెవెల్లో 74, పూర్తయినవి ఆరు గృహాలు. కూటమి ప్రభుత్వం గోడ లెవెల్‌లో ఉన్నవారికి రూ.30వేలు, స్లాబ్ వేసిన వారికి రూ.40 వేల ప్రకారం బీసీ, ఎస్సీల గృహ లబ్ధిదారులకు అదనంగా డబ్బులు ఇవ్వనున్నారు. ఇంటి నిర్మాణం జోలికి వెళ్లాలన్నా కూడా భయపడుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపితే గాని పనులు ముందుకు కదలని పరిస్థితి.

నిర్మాణాలకు నోచుకోని జగనన్న కాలని

ఇంజినీర్లు నిరంతర అధ్యయనం చేయాలి

5.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడం సంతృప్తికరం : 'గోపవరం'

ప్రజాశక్తి - కడప సిటీ

వెలిగల్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోపవరం శ్రీనివాసులరెడ్డి

ఇరిగేషన్ ఇంజినీర్లు నిరంతరం అధ్యయనం చేయడం ద్వారా వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవచ్చని, తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా శని వారం ప్రజాశక్తి కలిసిన సందర్భంగా ఆయన తన వృత్తి జీవితంలోని సాంకేతిక మెళకువలను, ఇంజి నీరింగ్ అనుభ వాలను, స్మృతులను పంచు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపవరం నరసారెడ్డి, ఓబులమ్మ దంపతులకు 1963లో హైదరాబాద్‌లో జన్మించానన్నారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు ప్రాథమిక విద్యాభ్యాసాన్ని అభ్యసించాన న్నారు. నంద్యాల అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఆరవ తరగతి, కర్నూలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివానని తెలిపారు. 1979 నుంచి 1980లో అనంతపురం జిల్లా సాయిబాబా నేషనల్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశానని తెలి పారు. 1981 నుంచి 1985 వరకు ఉస్మానియా యూనివర్శిటీ హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బ్యాచి లర్ ఆఫ్ ఇంజినీరింగ్ చదివానని తెలి పారు. 1987లో ఎమర్జెన్సీ రిక్రూట్‌మెంట్ ద్వారా శ్రీశైలం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ కార్యాలయ డిజైన్స్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధుల్లో చేరానని తెలిపారు. ఇందులో రెండేళ్ల పాటు ఎస్ఆర్‌బిసి, ఎస్ఎల్‌బిసి, జిఎన్ఎస్ఎస్ విభాగాల్లో ఇన్వెస్టిగేషన్ విభా గంలో పని చే శానన్నారు. మ రో రెండేళ్లపాటు రంగారెడ్డి జిల్లా హైదరా బాద్‌లో నా బార్డు పను లకు ఎస్టి మేట్స్ అండ్ డిజైన్స్ విధులు నిర్వ హించానన్నారు. 2007 నుంచి 2015 వరకు డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్‌గా కర్నూలు జిల్లాలోని హెచ్ఎన్ఎస్ఎస్ పని చేశానన్నారు. 2015 నుంచి 2017 వరకు మీడియం ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వ హించానన్నారు. కర్నూ లు జిల్లా డోన్‌లోని కృష్ణగిరి రిజర్వాయర్‌ను పూర్తి చేసి, ఐదు వేల ఎకరాలకు నీటిని అందిం చానన్నారు. 2017 నుంచి 2020 వరకు ఎగ్జిక్యూ టివ్ ఇంజినీర్‌గా పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ దవళేశ్వరం విభా గంలో పని చేశా నన్నారు. 2023 జూన్ కడప జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బదిలీపై వచ్చి ఉద్యోగ విరమణ చేయనున్నట్లు తెలిపారు. తన 35 ఏళ్ల సర్వీసులో హైదరాబాద్‌లోని మైనర్ ఇరిగేషన్‌లో 40 చెరువుల పునరుద్ధరణ పనులకు ఎస్టిమేషన్ వేసి పూర్తి చేశానని తెలిపారు. శ్రీశైలం కుడి బ్రాంచ్ కెనాల్, గాలేరు -నగరి కాల్వ డిజైన్స్ పూర్తి చేశా నన్నారు. కర్నూలు హెచ్ఎన్ఎస్ ప్యాకేజీ-26లో కృష్ణగిరి ప్రాజెక్టును పూర్తి చేసి ఐదు వేల ఎకరాలకు సాగునీటిని అంది ంచా నన్నారు. హెచ్ఎన్ఎస్ స్టేజ్-2లో పైప్‌లైన్‌లు, మోటార్లు, పంప్ హౌస్‌లు పూర్తి చేశా నన్నారు. 2013లో ఎనిమిది పంప్‌హౌస్‌లు నిర్వహ ణ విధులు నిర్వహించానని తెలిపారు. దవళేశ్వరం ప్రాజెక్టు నేషనల్ హై వే బ్రిడ్జి పనులు చేపట్టామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజ మండ్రి పరిధిలోని ముసరమల్లి ప్రాజెక్టు కింద 22 వేల ఎకరాలకు సాగు నీటిని అందించానని, భూపతి పాలెం ప్రాజెక్టు కింద తొమ్మిది వేల ఎకరా లకు, వెంకటనగరం లిఫ్టు స్కీమ్ కింద 6,500 ఎకరా లకు, పుష్కర లిఫ్టు స్కీమ్ కింద 79 వేల ఎకరాలకు సాగునీటిని అందించడం సంతృప్తిని కలిగిం చిందన్నారు. పోలవరం ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ డిజైన్స్ పూర్తి చేయ డంలో భాగస్వామిగా ఉన్నా నని తెలిపారు. రంపచోడవరంలో ఎస్ఎంఐ ఇరి గేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించానన్నా రు. 2023 నుంచి 2025 వరకు వెలిగల్లు 56 కి.మీ లెఫ్ట్ కెనాల్ ద్వారా 100 చెరువులకు నీటిని అందించానన్నారు. తన ఇంజినీరింగ్ సర్వీసు లో 5.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడం సంతృప్తిని కలిగి ంచిందని పేర్కొన్నారు.

సస్యశ్యామలానికి చర్యలు చేపట్టాం : ఎంపీ

అంబకపల్లె చెరువును పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - లింగాల

రైతుల అభ్యున్నతి తమ ధ్యేయమని, ఆ మేరకు పొలాలకు సాగు నీరు అందించి సస్యశ్యామలం చేసేందుకు చర్యలు తీసుకున్నామని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంబకపల్లె చెరువును శనివారం ఆయన పరిశీలించారు. ఎంపీ నిధులతో రూ.2 కోట్ల 50 లక్షలతో హిరోజిపురం నుంచి అంబకపల్లె చెరువుకి పైపులైన్ ఏర్పాటు చేసి చెరువును నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి జలహారతి కార్యక్రమానికి హాజరవుతారన్నారు. చెరువును నీటితో నింపడం వల్ల అంబకపల్లె పంట పొలాలకు సాగునీటి సమస్య ఉండ దన్నారు. బోర్లలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం నీటిపారుదల అధికారులతో ఎంపీ చర్చించారు.

పలు కుటుంబాలకు ఎంపీ పరామర్శ..

వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన లోపట్నూతలకు చెందిన తేరా శివకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. దిగువపల్లెలో కేన్సర్ వ్యాధితో మృతి చెందిన రోషిరెడ్డి కుటుంబ సభ్యులను కూడా ఎంపీ పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బాబురెడ్డి, వెలిదండ్ల మల్లికేశవరెడ్డి, యూత్ కన్వీనర్ మనోహరరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జడ్జి డాక్టర్ బాబా ఫక్రుద్దీన్ సూచించారు. కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైళ్లను శనివారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా జడ్జి సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహా యం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసు కున్నారు. జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం, వారికి తగు న్యాయ సహాయం అందించడం వంటి అంశాలను వివరించారు. జైలు పరిసరాలు, టాయిలెట్లు, వంట గది, వసతి గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం చేశారు. ఏవైనా సమస్యలుంటే కమలాపురం, జమ్మలమడుగు ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిలను, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైళ్ల సూపరింటెండెంట్స్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్స్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

ఖైదీల గదలను పరిశీలిస్తున్న జడ్జి డాక్టర్ బాబా ఫక్రుద్దీన్

బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన

బాల్య వివాహాలపై బాలికలకు జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అవగాహన కల్పించారు. మైలవరం మండల నార్జంపల్లి హైస్కూల్‌లో శనివారం ఆమె బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భార్గవి మాట్లా డుతూ ఆడ పిల్లలను చదివిద్దాం వారి భవిష్యత్తుకు పునాది వేద్దామనే ఆలోచనలను తల్లిదండ్రులను కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బాల్య వివాహాలపై ఎప్పటి కప్పుడు తల్లిదండ్రులకు, బాలికలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వారికి వివరించాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రోత్సహించిన, సహకరించిన వారికీ శిక్ష తప్పదని హెచ్చరించారు. అనంతరం మైలవరం ఎపి రెసిడెన్షియల్‌లో వంటగదిని పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, హైస్కూల్ ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎపి రెసిడెన్షియల్ హైస్కూల్ వంటగదిని పరిశీలిస్తున్న జడ్జి భార్గవి

రోడ్డు భద్రలపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న సిఐ నర్సింహులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి

వేంపల్లె : ట్రాఫిక్ నిబం ధనలను పాటించి, రోడ్డు ప్రమాదాల నియం త్రణకు సహకరించాలని సిఐ నర్సింహులు కోరారు. స్థానిక కడప-పులి వెందుల, రాయచోటి బైపాస్ రోడ్డులో శనివారం ఆయన ఆటోల్లో ప్రయా ణిస్తున్న కూలీలు, మోటర్ బైకులో వెళుతున్న వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అధికలోడ్‌తో ఆటోలో వెళితే ప్రమాదాలు సంభవిస్తే కుటుంబాలు ఇబ్బందులు పడతాయని వివరించారు. అధిక లోడుతో వెళ్లే ఆటోలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మైనర్లుకు వాహనాలు ఇస్తే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగేఅవకాశం ఉందన్నారు. మోటర్ బైకులు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని కోరారు. రికార్డులు లేని వాహనదారులకు ఎస్ఐ తిరుపాల్ నాయక్ జరిమానా విధించారు.

నిరుపయోగంగా టూరిస్ట్ గెస్ట్‌హౌస్

బ్రహ్మంగారిమఠం : వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం నడిబొడ్డున ఉన్న టూరిస్ట్ గెస్ట్ హౌస్ నిరుపయోగంగా శిథిలావస్థలో ఉంది. 1994లో ఏర్పాటు చేసిన ఈ గెస్ట్ హౌస్‌కు ఓ చరిత్ర ఉంది. దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణం. కొరుగమ్మి రమణయ్య భార్య వెంకటసుబ్బమ్మ ఈ స్థలాన్ని ఇచ్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. పుణ్యక్షేత్ర ప్రాంతంలో టూరిస్ట్ గెస్ట్‌హౌస్‌ను అభివృద్ధి చేసుకోలేని టూరిజం యాజమాన్యం రూ.లక్షలు పోసి భవనాలు నిర్మించి వాటిని పట్టించుకోకలేదు. అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ అయినా చొరవ తీసుకొని పదిమందికి ఉపయోగపడేలా ఈ టూరిస్ట్ గెస్ట్‌హౌస్‌ను తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డివిఇఒ వెంకటేశ్వర్లు

అధ్యాపకులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

అధ్యాపకులు సమయపాలన పాటించాలని డివిఇఒ వెంకటేశ్వర్లు సూచించారు. చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపల్ షేక్ రంతుబాషా ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 2026 ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. ఆ మేరకు డివిఇఒ అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులందరూ కష్టపడి చదివి పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలని, గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

మంచి ప్రభుత్వానికి అండగా ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మన మంచి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. స్త్రీశక్తి పథకం సూపర్‌హిట్ కార్యక్రమంలో భాగంగా శనివారం పాత బస్టాండ్‌లోని గాంధీ సర్కిల్ వద్ద నుంచి నారాపురస్వామి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని మహిళా కార్యకర్తలు, మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని అమలు చేసిందన్నారు. త్వరలోనే ఆడబిడ్డ సంక్షేమ పథకం కూడా అమలు చేస్తామన్నారు. అంతకుముందు కొందరు మహిళలు జమ్మలమడుగు పట్టణంలో దోమలు విలయతాండవం చేస్తున్నాయని, పింఛన్ రాలేదని, కొండాపురం మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న వారికి ఉపాధి కల్పించాలని వంటి పలు సమస్యలను భూపేష్ సుబ్బరామిరెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన భూపేష్ సుబ్బరామిరెడ్డి సమస్యను అర్జీ రూపంలో అందిస్తే తాను వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో స్వయంగా ఆయనే మహిళలకు వడ్డించారు. కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి తండ్రి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, పొన్నతోట శీను, మహిళా నేతలు పెంచలమ్మ పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రాజశేఖర్

ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చు

ప్రజాశక్తి - వేంపల్లె

మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం ఎంతో అవసరమని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలి పారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో శనివారం కెమికల్ ఇంజినీరింగ్ విభా గం, ఎన్ఎస్ఎస్-4 ఆధ్వర్యంలో మెడిటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడి అలజడి పెంచు తుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ధ్యానం చేయడం మంచిదని సూచించారు. రెండు రోజుల పాటు విద్యార్థులకు ధ్యానం చేసే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యులు రాజశేఖర్, నాగవేణి ధ్యానం చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కోటేశ్వరి, డాక్టర్ సౌజన్య, పిఆర్‌ఓ తిరుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తవ్వారుపల్లెలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని తవ్వారుపల్లె గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని ప్రజలు వాపోతున్నారు. కొన్ని రోజులుగా తాగునీరు అందక పోవడంతో పలు వీధుల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి కొమ్మలూరు సమీపంలో నుంచి మంచినీరు సరఫరా కావాల్సి ఉంది. కొమ్మలూరు గ్రామంలో వరద నీరు ప్రవహిస్తుండడం వల్ల మోటారుకు మరమ్మతులు చేపట్ట లేకపో యామని అధికారులు చెబుతున్నారు ట్యాంకర్ల ద్వారానైనా మంచి నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో నాలుగైదు వీధులలో మాత్రమే తాగునీటి సమస్య ఉందన్నారు. స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతా ధికారులు స్పందించి సమస్యను పరిష్క రించాలని ప్రజలు కోరు తున్నారు.

మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, ప్రొద్దుటూరు

I.A.No.847/2021
In O.S.No. 587/2021

1. రాచమడుగు వెంకటసుబ్బయ్య. ...పిటిషనర్/వాది

Vs

1. రాచమడుగు వెంకట లక్ష్మి పల్లవి,
2. రాచమడుగు హనీష్, డోర్ నెం.101/46, గిద్దలూరు రోడ్డు, కలసపాడు గ్రామం, మరియు మండలం, వైయస్ఆర్ కడప జిల్లా. ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

నోటీసు

పై నెంబరు దావాలో పిటిషనర్/ వాది షెడ్యూలు దాఖలు ఆస్థులపై టైటిల్ డిక్లరేషన్ మరియు పర్మనెంట్ ఇంజక్షన్‌ను కోరుతూ దావా దాఖలు చేశారు. పై I.A.No.847/2021లో షెడ్యూల్డ్ దాఖలు ఆస్తులు ఇతరులకు అమ్మకుండా మధ్యంతర ఉత్తర్వులు కోరుతూ దాకలు చేశారు. పై I.A.No.847/21లో 1 మరియు 2వ రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టులో హాజరు అగుటకు 11.9.2025వ తేదీన వాయిదా ఉంది. కావున మీరు ఆ రోజు ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ కోర్టు నందు నేరుగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరు అయి ఆక్షేపణలు తెల్పుకోవల్సింది. లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మానించెదరు.

//By Order of the Court//
P. SUBRAMANYAM,B.Com.,B.L.,
వాది తరపున అడ్వకేట్, ప్రొద్దుటూరు.